క్లుప్తంగా

ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ప్రత్యేక తరగతులు



దుగ్గిరాల:దుగ్గిరాల బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్ కార్యక్రమం జరిగింది. మార్చి ఒకటి నుంచి 31 తేదీ వరకు రోబోటిక్స్ ఎలా నేర్చుకోవాలి, సాంకేతిక పరిజ్ఞానం అవగాహన శిక్షణ తరగతులు ఒకటో తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్స్ వరకు ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ట్రైనింగ్ సర్టిఫికెట్ అందజేస్తారని స్కిల్ అడ్వైజర్ ఆర్ కార్తీక్ తెలిపారు.

ఆస్తి వివాదం నేపథ్యంలో పెదనాన్నపై కత్తితో దాడి

తెనాలిరూరల్: ఆస్తి వివాదం నేపథ్యంలో పెదనాన్నపై యువకుడు కత్తితో దాడి చేసి గాయపర్చిన ఘటన తెనాలిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన శివనాయక్‌కు ఇంటి స్థలం విషయమై అతని తమ్ముడితో విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శివనాయక్‌పై అతని తమ్ముడి కొడుకు కార్తీక్ నాయక్ శనివారం కత్తితో దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీ టౌన్ ఎస్ఐ ప్రకాశరావు తెలిపారు.

క్షయను పూర్తిగా నివారించొచ్చు



దుగ్గిరాల: దుగ్గిరాల మండలం చిలువూరులోని యూనియన్ బ్యాంక్‌లో ఏర్పాటుచేసిన క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిలువూరు యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ యోగేష్ కుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని చెప్పారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పరీక్షలతో పాటు మందులు ఇస్తారని, క్షయ వ్యాధిగ్రస్తులకు కేంద్రం నెలకు రూ.1000 చొప్పున 6 నెలలకు రూ.6,000 రోగి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని వివరించారు. తెనాలి టీబి యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ మార్చి 24న వరల్డ్ టీబీడే సందర్భంగా స్కూల్లో, కాలేజీల్లో, పబ్లిక్ ప్రదేశాలలో, కమ్యూనిటీ ప్రదేశాలలో క్షయ వ్యాధిపై రాష్ట్ర , జిల్లా అధికారుల సూచన మేరకు అవగాహన కార్యక్రమాలు చేస్తున్నామని వెల్లడించారు.

ప్రజా చైతన్య సారథి రాజేశ్వరరావు



తెనాలి: కమ్యూనిస్టు ఉద్యమనేత, అభ్యుదయ కవి కాగితాల రాజేశ్వరరావు (కెరా) వర్ధంతి సభను శనివారం గాంధీనగర్‌లోని 'ఇస్కఫ్' కార్యాలయంలో నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత ఎంపీ రఘునాథరావు అధ్యక్షత వహించారు. అభ్యుదయ కళాసమితి ఆధ్వర్యంలో జరిగిన సభలో గాయని సీహెచ్ శ్రీదేవి మాట్లాడుతూ గేయ, నృత్యనాటికలు, నాటకాలను రచించిన రాజేశ్వరరావు జీవిత కాలం ప్రజాచైతన్యం కోసం కృషిచేశారని చెప్పారు. అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్యమండలి సాంస్కృతిక ఉత్సవాల్లో కెరా పాత్రను వివరించారు. ప్రజానాట్యమండలి నాయకుడు బొల్లిముంత కృష్ణ, మేకప్ కళాకారుడు వెంకటేశ్వరరావు, గాయని మౌనిక పాల్గొన్నారు.

4న రెయిన్‌బో ట్రస్టు విమెన్స్ డే సెలబ్రేషన్స్



తెనాలి: రెయిన్‌బో ట్రస్ట్, తెనాలి ఆధ్వర్యంలో ఏటా జరుపుకుంటున్న అంతర్జాతీయ విమెన్స్ డే వేడుకలు ఈనెల నాలుగో తేదీన నిర్వహించనున్నారు. ఇక్కడి గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని శనివారం ట్రస్ట్ వ్యవస్థాపరాలు డాక్టర్ డి.జీవనలత ఆవిష్కరించారు. విమెన్స్ డే వేడుకల్లో రెట్రో డ్యాన్స్, రీల్స్, హుక్ స్టెప్ డ్యాన్స్ పోటీలు, శారీ హౌసి, సిల్వర్ హౌసి, గోల్డ్ హౌసి, గ్రూప్ గేమ్స్ కార్యక్రమాల్లో 500 మంది మహిళలు పాల్గొంటారని తెలిపారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన స్త్రీమూర్తులకు సత్కారం ఉంటుందని చెప్పారు. కరపత్రం ఆవిష్కరణలో ట్రస్ట్ సభ్యులు చుండూరు వరలక్ష్మి, నంబూరు లక్ష్మీ అలేఖ్య పాల్గొన్నారు.



ఒకనాడు వైభవంగా నడిచిన సూపర్‌బజార్

సూపర్ దగా

- మాతృశ్రీ సూపర్‌బజార్‌ను
- టీడీపీ నేతలు చుట్టేశారు
- విచారణలో అవకతవకలు రుజువు అయినా బాధ్యులపై లేని చర్యలు
- 5,798 మంది సభ్యులు రూ.3.5 కోట్ల టర్నోవరుతో నడిచిన సంస్థ

తెనాలి: సహకార వ్యవస్థ అనే నైతిక ఉద్యమం భారతదేశానికి వరం అని పూజ్య బాపూజీ పిలుపును అందిపుచ్చుకున్న ఎందరో మహానుభావులు దేశ వ్యాప్తంగా సహకార ఉద్యమాన్ని అందుకున్నారు. అందులో తెనాలి కూడా ముందంజలో ఉంది. నూట పదిహేనేళ్ల క్రితమే ఇక్కడ జిల్లా కేంద్ర సహకార బ్యాంకును నెలకొల్పారు. జంపనిలో సహకార చక్కెర ఫ్యాక్టరీ, వడ్లమూడిలో సంగం డెయిరి ఆ క్రమంలోనే ఆవిర్భవించాయి. టీడీపీ హయాంలో జంపని చక్కెర ఫ్యాక్టరీ మూతపడింది. సంగం డెయిరి కంపెనీ చట్టంలోకి వెళ్లింది. టీడీపీ నేతల నిర్వాకంతో తెనాలిలోని మాతృశ్రీ సహకార స్టోర్స్ లిమిటెడ్ (సూపర్‌బజార్) ఉనికినే కోల్పోయింది. బాధ్యులపై జరిమానా వసూలుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

సహకార ఉద్యమంలో జిల్లాకే తలమానికమైన తెనాలిలో 1975లో మాతృశ్రీ కో–ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ (సూపర్ బజారు) ఏర్పాటైంది. మాజీ ఎమ్మెల్యే, గుంటూరు జిల్లాపరిషత్ దివంగత చైర్‌పర్సన్ దొడ్డపనేని ఇందిర తొలి చైర్‌పర్సన్‌గా ఆరంభమైన ఈ సంస్థలో 5,798 సభ్యులున్నారు. 1999 నాటికి వార్షిక టర్నోవరు రూ.75 లక్షలుండగా, అప్పటికి రూ.3.35 లక్షల రుణభారం ఉంది. అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొత్తమాసు తులసీదాస్ సూపర్‌బజారు చైర్మన్‌గా ఎన్నికయ్యారు. స్వతహాగా వ్యాపారి అయిన తులసీదాస్ నిస్వార్థంగా పనిచేసి, వేలాది మంది ప్రజలకు, సంస్థ సిబ్బందికి వెసులుబాటు కల్పించవచ్చని తలపోశారు.



అప్పట్లో టీబీ రోడ్డులో సూపర్‌బజారు నడిచిన కాంప్లెక్స్

ఎన్జీవో హోమ్‌లో నడుస్తున్న సూపర్‌బజారును టీబీ రోడ్డులోకి తీసుకొచ్చారు. విక్రయించే సరుకులపై దృష్టిపెట్టారు. సూపర్‌బజారులో మార్కెట్ ధర కన్నా తక్కువకు, నాణ్యమైన సరుకులు వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయి. మరిన్ని ఎక్కువ రకాలను విక్రయించసాగారు. నాలుగేళ్లలో సంస్థ అప్పులు తీరిపోయి లాభాలు వచ్చాయి. రెండు, మూడు టర్మ్‌లు ఆయనే చైర్మన్‌గా పనిచేశారు. సూపర్‌బజారును లాభాల దిశగా నడిపిస్తున్న తీరుకు, ఇతర అన్ని రాజకీయపార్టీలు ఆయనపై పోటీపెట్టకుండా ఏకగ్రీవ ఎన్నికకు సహకరిస్తూ వచ్చాయి. వ్యాపారం పెరగటంతో పక్కనే మరో కాంప్లెక్సుకు విస్తరించారు. కిరాణా, క్లాత్, ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ, నోట్సులు, నూనెల కోసం వేర్వేరు స్టాల్స్ నడిచాయి. కిరాణా సరుకులను ప్రత్యేకంగా బాగుచేయించి నాణ్యత, తగిన తూకంతో ప్యాకింగ్ చేసి విక్రయించారు.

ఫలితంగా అమ్మకాలు అనూహ్యంగా పెరిగాయి. కిరాణా స్టాల్‌లో విక్రయాలు రోజుకు లక్ష రూపాయలకు చేరుకున్నాయి. ఒకరోజు గరిష్ఠంగా రూ.1.60 లక్షలకు అమ్మకాలు చేశారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు, నోట్సుల వ్యాపారం సీజనులో రూ.20 లక్షల వరకు జరిగింది. క్రమేపీ వార్షిక టర్నోవరు రూ.3.5 కోట్లకు చేరుకుంది. అప్పటికి సహకార రంగంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉన్న విజయవాడలోని విజయకృష్ణ సూపర్‌బజారు తర్వాత అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న సంస్థగా తెనాలి సూపర్‌బజారు గుర్తింపుకు నోచుకుంది. సంస్థలో 36 మంది సిబ్బంది పనిచేస్తూ వచ్చారు. వీరిలో 14 మంది రెగ్యులర్, 22 మంది కాంట్రాక్టు ఉద్యోగులున్నారు. జీతభత్యాలు, కరెంటు బిల్లులు, నిర్వహణ ఖర్చులతో కలిపి ఏడాదికి రూ.10 లక్షలు పోను సంస్థ లాభాలను ఆర్జిస్తూ వచ్చింది. నాణ్యమైన నిత్యావసరాలను తక్కువ ధరకు ఇస్తూ ప్రజలకు వెసులుబాటు కల్పించటమే కాకుండా సంస్థ లాభాలను అంచనా వేసుకుంటూ సిబ్బందికి బోనస్‌ను ముందుగానే పంపిణీ చేసింది.

మూడు టర్మ్‌లు ఆ విధంగా నడిచిన సూపర్‌బజారుకు, తర్వాతి కాలంలో ప్రాభవం కొరవడింది. టీడీపీ అధికారంలోకి వచ్చాక పాలకవర్గం ఎన్నికలు కేవలం ఆ పార్టీ నేతలకు రాజకీయ పునరావాసం కోసం అన్నట్టుగా తయారయింది. లాభసాటి సహకార వ్యాపారం పోయి, పరస్పర 'సహకారం' ప్రధానంగా సాగిందన్న విమర్శలు వచ్చాయి. టీడీపీ పాలకవర్గం నడిచిన 2014–19 కాలంలో చివరి ఏడాది టీబీ రోడ్డులోని కాంప్లెక్సు నుంచి సూపర్‌బజారును ఖాళీ చేశారు. గంగానమ్మపేట రైతుబజారులోని ఒక స్టాల్‌లోకి బోర్డు చేరింది. తర్వాత కొద్దినెలలకు కనీసం బోర్డు కూడా కనిపించలేదు.

> సూపర్‌బజార్ అదృశ్యమైన వైనంపై అప్పట్లో 'సాక్షి'లో ప్రచురితమైన కథనం పట్టణంలో కలకలం సృష్టించింది. ఆడిట్ చేయించకుండా అవకతవకలకు పాల్పడి, చాప చుట్టేశారు. సంబంధిత ఫైల్స్‌ను కూడా కనిపించకుండా చేశారు. 2017–18 సంవత్సరానికి ఆడిటింగ్ చేయించలేదు...మరుసటి ఏడాది ఆడిట్ చేయించినా ఫైల్స్ అందుబాటులో లేవని అప్పట్లో డివిజనల్ సహకార అధికారిణి చెప్పారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై రూ.20 లక్షల జరిమానా వసూలుకు నిర్ణయించినట్టు సమాచారం. అయినా ఇప్పటివరకూ ఎలాంటి చర్యలూ లేవు.

ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం



హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



పరీక్షకు హాజరయ్యేందుకు వచ్చిన విద్యార్థులు

తెనాలిఅర్బన్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని 12 పరీక్ష కేంద్రాల వద్దకు ఉదయం 8.30 గంటలకు విద్యార్థులు వచ్చారు. 8.45 గంటలకు పరీక్ష హాల్‌లోకి కళాశాల నిర్వాహకులు అనుమతిచ్చారు. కేంద్రాల వద్ద బయట బోర్డు పై విద్యార్థుల హాల్ టిక్కెట్ నెంబర్లు ఏర్పాటుచేశారు. వాటి ఆధారంగా విద్యార్థులు వారి గదుల వద్దకు వెళ్ళి దానిలో పరీక్ష రాశారు. మొదటి రోజు కావడంతో కొందరూ విద్యార్థులు తల్లిదండ్రులతో కేంద్రాలకు వచ్చారు. పట్టణంలోని వైష్ణవి జూనియర్ కళాశాల, చైతన్య జూనియర్ కళాశాల, విశ్వ జూనియర్ కళాశాల, జెఎంజె కళాశాలలను ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశాయి. మొదటి రోజు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని అధికారులు తెలిపారు. సోమవారం ద్వితీయ సంవత్సర మొదటి పరీక్ష జరగనున్నది.

పార్కులను పరిశుభ్రంగా ఉంచండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: పార్కులను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. చినరావూరులోని సత్యనారాయణ పార్కును శనివారం ఆయన పరిశీలించారు. సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత మిత్ర పథకం ద్వారా సిబ్బందికి వేతనాలు చెల్లించినట్టు పేర్కొన్నారు. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే విషయంలో ఎక్కడా లోపాలు లేకుండా చూడాలన్నారు. పార్కులో సంచరిస్తూ ఆవరణలో ఎటువంటి వ్యర్థాలు వేయకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, హార్టికల్చర్ ఆఫీసర్ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

పిల్లలే పనోళ్లు..



మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో పనులు చేయించారు. పాఠశాల ఆవరణను చీపుర్లతో ఊడిపించే పనిని ఉపాధ్యాయులే దగ్గరుండి చేయించడం విశేషం. ఇటీవల పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్లో విద్యార్థులతో డాబా పైకి బల్లలు, కుర్చీలు మోపిస్తున్న వీడియో వైరల్ కాగా, విద్యాశాఖ అధికారులు విచారణకు ఆదేశించారు. అయినా ఉపాధ్యాయుల్లో మార్పురావడం లేదు.

పింఛన్ల పంపిణీ



తెనాలిఅర్బన్: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం తెనాలి పట్టణంలో శనివారం ప్రారంభమైంది. పట్టణంలోని 47 సచివాలయాల పరిధిలోని ఉద్యోగులు ఉదయం నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్ళి వాటిని పంపిణీ చేశారు. తెనాలి పట్టణంలో మొత్తం 15,031 పింఛన్లకు గాను సాయంత్రం 6గంటల సమయానికి 14,421 పింఛన్లు పంపిణీ చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. మిగిలిన పింఛన్లను ఆది, సోమవారాల్లో పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. పట్టణంలో పలు చోట్ల జరుగుతున్న పింఛన్ల పంపిణీని కమిషనర్ బండి శేషన్న పరిశీలించి పలు సూచనలు చేశారు.

మాదిగ అమరవీరుల సంస్మరణ దినం



తెనాలిటౌన్: కొలకలూరు గ్రామంలో మాదిగ అమరవీరుల సంస్మరణ దినం శనివారం నిర్వహించారు. మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ పాల్గొని అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ అభివృద్ధి సంఘం రాష్ట్ర కన్వీనర్ కూచిపూడి మోహన్ మాదిగ, మండల అధ్యక్షుడు ఉన్నం సన్నీ మాదిగ, ఉన్నం ఆంథోని మాదిగ, ఉన్నం ఇమ్మానియేల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవ భేష్

ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ మహేష్

తెనాలిటౌన్: సేవా దృక్పథంతో స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్ కొనియాడారు. కొలకలూరు గ్రామంలో డొనేట్ ఫర్ పూర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన వైద్యశిబిరాన్ని లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. డాక్టర్ మాధవీలత వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. డాక్టర్ పూజిత మాట్లాడుతూ డొనేట్ ఫర్ పూర్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రభాకరరాజు జయంతి సందర్భంగా సేవ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని తెలిపారు. సంస్థ అధ్యక్షులు రాకేష్ మాట్లాడుతూ 2019లో ప్రారంభించిన సంస్థ ద్వారా ఇప్పటి వరకు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలియజేశారు. వైద్య శిభిరంలో అవసరమైన వారికి మందులతోపాటు కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ ఆదర్స్, అనుపమ్, రోహిత్, రాజ్‌కుమార్, వినయ్‌కుమార్, రవికిరణ్; వెంకటేశ్వరరావు, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కల్నల్ మహేష్



శిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ మాధవిలత

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

తెనాలిఅర్బన్: ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అసువులుబాసిన అమర వీరులను స్మరించుకోవాల్సిన అవసరం మాదిగ జాతిపై ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు చిలకా కిరణ్ మాదిగ, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు సొపాటి కిరణ్ పేర్కొన్నారు. మాదిగ అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకుని చెంచుపేట ఇందిరానగర్‌లోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద శనివారం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనలో వారు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందరికి అందిననాడే వారికి నిజమైన నివాళి అని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలోని ముఖ్యమంత్రులు, ఎస్సీ వర్గీకరణ జరిగే విధంగా చర్యలు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ నాయకులు బి.ప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు తంగిరాల మరియదాసు, కొక్కిలిగడ్డ మనోజ్, పినపాటి రత్నరాజు, గాజులవర్తి సురేష్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న చిలకా కిరణ్, సొపాటి కిరణ్ తదితరులు

ఆదర్శ విద్యావేత్త బండారు జ్యోతిస్వరూపరాణి

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, పర్యవేక్షక పరిశోధక ఆచార్యులు డాక్టర్ బండారు జ్యోతిస్వరూపరాణి తొలి సంస్మరణ కార్యక్రమం శనివారం స్థానిక చెంచుపేటలోని స్విమ్మింగ్‌పూల్ కల్యాణమండపంలో ఘనంగా జరిగిది. 'కార్డ్స్' డైరెక్టర్ డాక్టర్ స్వర్ణలతా దేవి అధ్యక్షత వహించారు. టర్కీ నుంచి వచ్చిన డాక్టర్ ప్రేమ్‌చంద్, ఆచార్య లక్ష్మి తమ ప్రసంగాల్లో బోధనలో, పరిశోధనలో నిబద్ధత కలిగిన జ్యోతిస్వరూపరాణి అదర్శ అధ్యాపకురాలుగా గుర్తుచేసుకున్నారు. ఆమె రాసిన అనేక వ్యాసాలు డిగ్రీ, పీజీ విద్యార్థులకు పాఠ్యాంశాలుగా రావటం గర్వించదగిన విషయమన్నారు. జ్యోతిస్వరూపరాణి మృతి తెలుగు భాషకు, సాహిత్యానికి తీరని లోటని డాక్టర్ సామల లక్ష్మణబాబు, రవివర్మ, గీతా వీరేన్, ధనలక్ష్మి సాల్మన్, రెవరెండ్ ఏసుపాదం, లెనిన్, ప్రకాష్‌బాబు, విజయరత్న జోసఫ్, డాక్టర్ హిమబిందు, కనపర్తి అబ్రహాం లింకన్, కొండముది రమేష్‌బాబు అన్నారు. ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి పర్యవేక్షించారు. తొలుత జ్యోతిస్వరూపరాణి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.



జ్యోతిస్వరూపరాణికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

సీపీఐ సీనియర్ నేత వేము సువార్తమ్మ మృతి



తెనాలి: పట్టణానికి చెందిన సీపీఐ సీనియర్ నేత, విశ్రాంత ఉపాధ్యాయిని వేము సువార్తమ్మ (100) శనివారం అయితానగర్‌లోని స్వగృహంలో మృతి చెందారు. సీపీఐ నాయకుడు వేము రామసుబ్బయ్య సతీమణి సువార్తమ్మ. ఆమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. భర్త రామసుబ్బయ్యతోపాటు కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. తెనాలి తాలూకా మహిళా సమాఖ్యలోనూ ప్రముఖ పాత్ర పోషించారు. మహిళా సమస్యలపై జరిగిన ఉద్యమాలు, పోరాటాల్లో పాల్గొన్నారు. 'బెంగాల్ కరువు' బుర్రకథను గ్రామగ్రామాన ప్రదర్శించారు. తన కుమారులు, కుమార్తెలకు కమ్యూనిస్టు పేర్లతో నామకరణం చేసి, పార్టీపై తనకు గల అభిమానాన్ని చాటుకున్నారు. ఆమె మృతివార్త తెలిసిన కమ్యూనిస్టు పార్టీ నాయకులు బొల్లిముంత కృష్ణ, కనపర్తి బెన్‌హర్ తదితరులు ఆమె భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి అంజలి ఘటించారు. కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు వపప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, పరుచూరి వెంకటేశ్వరరావు, కనపర్తి కృపాదాస్, చెరుకుమల్లి సింగారావు తదితరులు సువార్తమ్మ కుటుంబసభ్యులకు సంతాపం తెలియజేశారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు అంతిమ యాత్ర జరుగుతుందని కుమారుడు వేము సమత తెలిపారు.

దేవికారాణికి 'వారసత్వ దీప్తులు' పురస్కారం

దేవికారాణికి 'వారసత్వ దీప్తులు' పురస్కారం

తెనాలి: పట్టణానికి చెందిన కవయిత్రి, ప్రభుత్వ ఉపాధ్యాయిని కొలకలూరి దేవికారాణి 'వారసత్వ దీప్తులు' పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అక్షరయాన్, సీతాస్, అభిజ్ఞ భారత్ సంస్థల సంయుక్త నిర్వహణలో శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జాతీయ సాహిత్య సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు, వారి వారసులకు సంబంధించిన 'వంశపారంపర్య దీప్తులు' సంకలనాన్ని వెలువరించారు. ఆయా సాహితీవేత్తల వారసులను 'వారసత్వ దీప్తులు' పేరుతో సత్కరించారు. ప్రఖ్యాత స్త్రీవాద కవయిత్రి కొలకలూరి స్వరూపరాణి కుమార్తెగా కవితా రచనలో రాణిస్తున్న దేవికారాణి ఈ సత్కారాన్ని అందుకున్నారు. ఐఏఎస్ అధికారి, పూర్వ ఎన్నికల అధికారి చిట్ల పార్థసారథి, దీపికారెడ్డి, ముక్తేవి భారతి, రాణి నల్లమోతు, స్వప్న, రమాదేవి కులకర్ణి, వాణి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. సత్కారం అనంతరం దేవికారాణి రచించి ఆలపించిన 'స్త్రీ శక్తి' పాట ప్రశంసలను అందుకుంది.



దేవికారాణికి పురస్కారం ప్రదానం చేస్తున్న ఐఏఎస్ అధికారి పార్థసారథి

'హోలమ్మో'..!



గంగానమ్మపేటలోని గంగమ్మ తల్లి ఆలయం ఎదుట గల కూడలిలోని మ్యాన్‌హోల్‌పై ఉంచి ఇనుపరేకు వాహనాల రాకపోకలకు తరచూ స్థానభ్రంశం చెందుతోంది. దీంతో మ్యాన్‌హోల్‌లో పడిపోయే ప్రమాదం ఏర్పడుతోంది. స్థానికులే స్థానభ్రంశం చెందిన ఇనుపరేకును మ్యాన్‌హోల్‌పైకి చేరుస్తున్నారు. పటిష్ఠంగా ఏర్పాటుచేయటాన్ని అధికారులు పట్టించుకోవటం లేదంటున్నారు.

\- తెనాలి

కొండ'ముచ్చట'



పట్టణంలో కోతుల సంచారం సాధారణమైంది. దీనికితోడు ఇప్పుడు కొండముచ్చుల వంతు వచ్చినట్టుంది. స్థానిక కొత్తపేటలోని శనివారం ఒక కొండముచ్చు హల్‌చల్ చేసింది. అక్కడి కంప్యూటర్ ఇనిస్టిట్యూట్, ఇతర నివాస సముదాయాల్లోకి వెళ్ల స్థానికులను కాసేపు హడలెత్తించింది.

\- తెనాలి